# వెంటాడే నీడలు

## 1. తాండవకృష్ణ

తాండవకృష్ణ అనే క్రిమినల్ వకీలు పేరు హైదరాబాదు సిటీ లేదా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాక మొత్తం భారతదేశంలో ప్రసిద్ధి పొందింది అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. దూరదర్శన్ ప్రేక్షకులందరికి జాతి, మత భేదం లేకుండా పాండవ కృష్ణుడు తెలుసును, ఎందుకంటే వాళ్ళు మహాభారత సీరియల్‌ను వీక్షించినివారు కనుక. కానీ, మా తాండవకృష్ణుడికి అంత పాప్యులారిటీ ఉండకపోవచ్చు. ఐనా కూడా, దేశంలోని అన్ని న్యాయస్థానాలలో తాండవనృత్యం చేసే నల్లకోటువాళ్ళకు, ఆ నృత్యం చూసి చూసి నిద్రపోతున్న న్యాయాధిపతులకు తాండవకృష్ణుని గురించి కొద్దిగానైనా తెలిసే ఉంటుంది. హైదరాబాదులో ఉన్న హైకోర్టులోను, కొన్ని కొన్ని సెషన్సు కోర్టులలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లకు భయం. పరిశ్రమ తలనొప్పిని ప్రసాదిస్తూ, తనను సమీపించే నేరస్తులను ఉరితాడు నుంచి తప్పించే వ్రతం చేస్తూ సకల ఐశ్వర్యాలు అనుభవిస్తున్నాడు తాండవకృష్ణ అనే మహానుభావుడు. ఆయన ఏ కేసు తీసుకున్నా, ఎలాంటి కేసు తీసుకున్నా ప్రాసిక్యూషన్ పక్షం ఓడిపోవడం ఖాయం. ఖూనీ కేసులు మాత్రమే కాకుండా కొన్ని కొన్ని ముఖ్యమైన దొంగతనాలు, దోపిడి కేసులు కూడా ఆయన చేపడతాడు. ఒక కేసు తీసుకోవాలా వద్దా అని నిర్ణయించడానికి ఆయనకి ఒకటే కొలబద్ద ఉండేది. ఆ కొలబద్ద ఏమిటంటే ఆ ముద్దాయికి స్వయంరక్షణకి కావాల్సిన ధనబలం ఉండటమే.

న్యాయవాదులకు సత్యం, ధర్మం రక్షించవలసిన బాధ్యత ఉంది కదా! అని ఎవరైనా అడిగితే ఆ బాధ్యత మాదికాదు, న్యాయస్థానాలది అని ఆయన ఖచ్చితంగా జవాబిస్తాడు. ఒక నేరం జరిగినపుడు ఫిర్యాదు చేయవలసిన బాధ్యత

పౌరులది. కానీ పౌరకర్తవ్యం అనేదే తెలియని పౌరులు ఒక వేళ అలాంటి నేరాలు జరిగినపుడు ఫిర్యాదు చేయకపోయినట్లైతే దానిని బయటికి తీసుకురావడం పోలీసువాళ్ళ బాధ్యత. ప్రజల సహకారం లేనిదే పోలీసువాళ్ళు మాత్రం ఎలా చేయగలరు? అని ఎవరైనా అడిగితే "వాళ్ళు ఉన్నదే అందుకు. అది వాళ్ళ శిక్షణలో ముఖ్యమైన అంశం కదా! మరి ఇంటిలిజన్స్ అంటే ఏమనుకుంటున్నారు? ప్రజలలోని అన్ని వర్గాల వారితో దగ్గర సంబంధాలు పెట్టుకొని, సమాజంలో జరిగినవి, జరుగుతున్నవి జరగబోయేవి తెలుసుకోవడమే పోలీసు వాళ్ళ ప్రథమ కర్తవ్యం." అని ఆయన అంటాడు. "జ్యోతిష్యం, హస్తసాముద్రికం నూరి తాగకుండా అలాంటి విషయాలు పాపం పోలీసులు ఎలా తెలుసుకుంటారు" అని ఎవరైనా అడిగితే జ్యోతిష్యం కానీయండి, హస్తసాముద్రికం కానీయండి, ముఖలక్షణ శాస్త్రం కానీయండి వాళ్ళు నేర్చుకుంటే నాకేం అభ్యంతరం లేదు. ఒక్కొక్క పోలీసుస్టేషన్లో ఒక్కో జోస్యుణ్ణి నియమించుకోవచ్చు లేదా ఎవరినైనా పిలకపట్టుకొని ఈడ్చుకురావచ్చు. అదీ చేతకాకపోతే ఒక చిలక జోస్యుణ్ణి కూర్చోపెట్టుకోవచ్చు. ఏదైనా సరే చూసి, విని తెలుసుకోవలసిన సామర్థ్యం పోలీసువాళ్ళకు లేకపోతే అది పోలీసు డిపార్ట్‌మెంట్ ఎలా అవుతుంది?" అని అతని ప్రతిస్పందన. "అదంతా సరే! ఎలాగైనా నేరాలని కనిపెట్టడం, నేరస్తులను పట్టుకోవడం అనేది పోలీసు వాళ్ళ బాధ్యత. కానీ, నేరాలు జరిగినపుడు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయడం పౌరుల కర్తవ్యమే. ఎలాంటి కష్టాలైనాపడి, సాక్ష్యాలు సేకరించి, నేరస్తులను పట్టుకొని, న్యాయస్థానం వరకు తీసుకుని వస్తే, మీలాంటి అడ్వకేట్లు వాళ్ళ పక్షం వహించి, వారిని వదిలించుకుంటారు. ఎవరైనా ఒకడు వచ్చి తాను ఫలానా వాడిని హత్యచేశానని మీతో చెపితే అతను, అతని తరుపున సాక్ష్యులకు న్యాయస్థానంలో ఎలా వ్యవహరించాలో నేర్పించి, న్యాయవ్యవస్థని తలక్రిందులు చేయడమే కాదా మీ వృత్తి." అని ఒక విమర్శను విసిరితే కొంచెం కూడా చిరాకు పడకుండా ఆయన చెపుతారు "అయ్యో మిత్రమా! న్యాయస్థాన విషయాలలో మీకు సరైన అవగాహన లేనట్లుంది కనుకనే మీరు ఇలా అంటున్నారు. న్యాయాన్యాయాలను నిర్ణయించే తాహతు

న్యాయాధికారికి మాత్రమే ఉంటుంది. అపరాధాన్ని గూర్చి జడ్జ్ చేయాల్సిన బాధ్యత జడ్జీగారిది. నేరం రుజువు చేయాలంటే అది సంశయాతీతంగా చేసి తీరాలి. ఈ విషయంలో ప్రతివాది ప్లీడరు ప్రాసిక్యూషన్ వారితో సహకరించాలా లేదా కుమ్మక్కవ్వాలా అనేది చట్టాన్ని భ్రష్టుపట్టించే కుట్ర అవుతుందని నా అభిప్రాయం. వాది ప్రతివాది పక్షాలు కత్తెరకున్న రెండు అంచుల మాదిరిగా వ్యవహరించాలని న్యాయనిపుణులు వక్కాణించారు. ఆ కత్తెర రెండు అంచులు ఒకే దిశగా కదలకుండా పరస్పర విరుద్ధంగా కదిలితేనే కత్తిరింపు సాధ్యం. మన న్యాయవ్యవస్థలో ఒక ముఖ్యమైన సిద్ధాంతం ఏమిటంటే వందమంది అపరాధులు తప్పించుకున్నా సరే ఒక నిరపరాధి కూడా శిక్షించబడకూడదు, అలాంటప్పుడు, న్యాయాన్ని నాలుగు పాదాలా నడిపించే బాధ్యత ఎవరికి ఎక్కువ ఉంది? శిక్ష ఇప్పించచూసేవాడిదా?.... తప్పించచూసే వాడిదా?... అందుకే న్యాయాన్ని పరిరక్షించే వాళ్ళం ప్రతివాది ప్లీడర్లమైన మేమే. ఒక నేరస్తుడి మీద న్యాయస్థానంలో అభియోగం వేసినపుడు ప్రాసిక్యూషన్ వాళ్ళు ఆశించేది ఎలా న్యాయం జరగాలా అని కాదు ఎలా శిక్ష పడాలా అని. అభియోగంలో చిక్కుకున్న వ్యక్తులను కాపాడడం లేదా కనీసం శిక్షాతీవ్రతను తగ్గించడమే మా ఆశయం. తప్పు చేయడం మానవనైజం, క్షమించడం దేవతా లక్షణం. ఏదైనా సరే మరిచిపోయే, క్షమించే ఉదాత్తత మనిషికి ఉండాలని పెద్దలు చెప్తారు. యాదృచ్ఛికంగా నేరాలు చేసిన వారిని శిక్షించి, వారిని మరికొన్ని తప్పులు చేయడానికి ప్రేరేపించి, వారిని సమాజానికి శత్రువులుగా తయారుచేయడమేనా న్యాయవ్యవస్థ లక్ష్యం? నేరస్తులను కారుణ్యంతో, విశాల దృక్పథంతో క్షమించి, వారిని మంచి పౌరులుగా మారేందుకు అవకాశమివ్వడమే మన ధర్మం. అలా కాకుండా మనిషిని మృగంగా మార్చే న్యాయవ్యవస్థ ఆటవికులదే కానీ నాగరీకులది కాదు అని వారి వాదన."

అతనిని పాదరక్షలతో కొట్టాలని వచ్చిన వాళ్ళు అతని వాక్పటిమకు ముగ్ధులై పాదాభివందనం చేసి మరీ వెళతారు. అతని జిహ్వాగ్రంపై సరస్వతి ఇలా నర్తిస్తూంటే అతను గొప్ప ప్లీడరు కావడంలో ఆశ్చర్యం లేదు.

ఐదు అడుగుల ఎనిమిది అంగుళాల పొడవు పొడవుకు తగిన లావు, చక్కని మేని ఛాయ, యాభై శాతం బట్టతల, శాంతగంభీరమైన ముఖం, ఆ ముఖానికి దళసరి చట్రాల కళ్ళజోడు ఇవన్నీ కలిస్తే అది అడ్వకేటు తాండవకృష్ణరూపం. ఎవరినైనా హఠాత్తుగా ఆకర్షించే............ అగాధాన్నుంచి వెలికివస్తున్నట్లున్న కంఠస్వరం ఆయనది. పురుషత్వాన్ని నిర్ధారించటానికి ఇంకే సాక్ష్యం అక్కరలేదు కాబోలు! ఆయన ఒక చిరుమీసం అయినా పెట్టుకోలేదు. సామాన్యంగా చాలా మర్యాదతో కూడిన ప్రవర్తన, ఎవర్నీ నొప్పించరు, ఎవరికీ విరోధి కాదలచరు. వకీలుగా ప్రాక్టీసు మొదలుపెట్టినప్పటినుంచి ఆయన పట్టినదంతా బంగారమే, అన్నీ విజయపరంపరలే. ఒక సీనియర్ అడ్వకేట్ కింద తాండవకృష్ణ అయయుక్త తాండవం చేసుకుంటూ పోతూఉంటే మేళాలు క్రమంగా వాటికవే శ్రుతి కలపసాగాయి. సీనియర్ అడ్వకేటు ఉన్న చోటునే ఉండిపోయాడు కానీ! ఆయన జూనియర్ మాత్రం యువజనంతో యువావేశంతో సీనియర్‌ని దాటి ఎంతో ముందుకు వెళ్ళగలిగాడు.

ప్రఖ్యాతి చెందిన ఒక ధనిక కుటుంబానికి తాండవకృష్ణ అల్లుడయ్యాడు. దానితో అనుకున్నదానికంటే ఎక్కువగా అతనికి స్థానఔన్నత్యం, ధనఔన్నత్యం లభించాయి. ఒక సంవత్సరం లోపల ప్రేమవని అయిన సులోచన ఆయనకి ఒక పుత్రుణ్ణి కానుకగా అందించినప్పుడు ఒక జంట హత్యల కేసు వాదించి గెలిచినంతగా సంతోషపడ్డాడు, తాండవకృష్ణ. వాళ్ళు ఆ బిడ్డకు మురళీకృష్ణ అని నామకరణం చేశారు. ఆ ముగ్గురి జీవితాలు సుఖంగా సాఫీగా జరిగిపోతుండగా, మురళీకృష్ణకి నాలుగు సంవత్సరాలు వచ్చేసరికి అతనికి ఒక చెల్లాయి తోడయ్యింది. కానీ, ఆ చిన్నారి ఆగమనంతో తల్లి ప్రాణాలు పంచభూతాల్లో కలిసిపోయాయి. ప్రసవసమయంలో స్పృహకోల్పోయిన ఆమె తిరిగి స్పృహలోనికి రాలేదు. గర్భస్థశిశువు ఆరోగ్యం కోసం అన్ని జాగ్రత్తలు తీసుకున్న ఆ తల్లికి పాపం పుత్రికా దర్శనం కలగలేదు.

మాతృప్రాణం అపహరిస్తూ శీర్షాసనంతో ఈ లోకంలో అడుగిడిన ఆ పాపను తాండవకృష్ణ ద్వేషించలేదు. తన ప్రాణప్రియ చరమాంకానికి ఆ చిన్నారి పాప కారణభూతమని అతను అనుకోలేదు. కానీ, ఆ శిశుజననం ఆ కుటుంబానికి ఒక దుశ్శకునంగా అతను భావించకను పోలేదు. సులోచన పోయిన కొన్ని సంవత్సరాల తరువాత కూడా ఆయనకి మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనే ఆలోచనే రాలేదు. ఆయనే తల్లీ తండ్రి అయి పిల్లలిద్దరినీ పెంచాడు........ వాత్సల్యామృతాన్ని అపరిమితంగా వర్షింపచేయసాగాడు. వారి పరిపోషణానికి, పరిరక్షణకి శిక్షణ పొందిన దాదుల్ని నియోగించాడు. అంత డబ్బిచ్చి నియమించిన దాదులు అందంగా ఉండకూడదన్న నియమం ఎక్కడా లేదు కదా! ప్రతిరాత్రీ నాలుగైదు పెగ్గులు విస్కీ తాగే అలవాటు ఉన్న ఆ వకీలుదొర గారికి, ఆ దాదుల్నించి వెల్లడించడానికి, వీలులేని పరిచర్యలు స్వీకరించడానికి ఎలాంటి విముఖత ఉండేది కాదు. దేవుడి పైన కానీ, ఉత్తమ సిద్ధాంతాలపైన కానీ, నమ్మకం పెట్టకుండా, తన మేధాశక్తిపై ఎంతో అభిమానం ఉన్న తాండవకృష్ణుడికి ధనార్జన అనే ఏక ముఖోద్దేశంతో పాటు, జీవితాన్ని వీలున్నంత వరకు ఆస్వాదించాలని కోరిక ఉంటే అది అతని బుద్ధి తక్కువతనం వల్ల అని చెప్పడానికి వీలులేదు.

తండ్రిగారి అమిత వాత్సల్యం కారణం కాబోలు మురళీకృష్ణకు సోమరితనంపై ప్రతిపత్తి చదువుపైన విప్రతిపత్తి పెరుగుతూనే వచ్చాయి. ధనికుడు మరియు ప్రసిద్ధుడైన తండ్రిగారి సుపుత్రుడు కావడం వల్ల అతనికి పరీక్షలలో ఉత్తీర్ణత ఇవ్వక తప్పలేదు ఆ విద్యాలయాధికారులకి, కానీ, మెట్రిక్యులేషన్, పబ్లిక్ పరీక్ష కావడం వల్ల, దానిలో మాత్రం వాయిదా పద్ధతుల మీద ఉత్తీర్ణత పొందగలిగాడు. అతని చెల్లెలు అనూరాధ విషయానికొస్తే, ఆమె మాత్రం, చదువులో చాలా సమర్థురాలు. ప్రతి తరగతిలో ఆమె అద్వితీయంగా పురోగమించింది. తన పుత్రరత్నం యొక్క గుణగణాలు, సామర్థ్యాలు తెలుసుకొన్న తాండవకృష్ణ అతని సురక్షితమైన, సుశోభితమైన భవిష్యత్తు కోసం బాటలు వేయసాగాడు. బంజారాహిల్స్‌లో తన భవంతిని ఆనుకొని ఉన్న ఇంటిని కొని దానిని ఒక పెద్ద

బంగ్లాగా మార్చాడు. దానితో తన పిల్లలిద్దరికి చెరొక బంగ్లా సమకూరిందని అతడు సంతోషించాడు. చచ్చీ, చెడి శాయంగల విన్నపాలుగా, మురళీకృష్ణకి బి.కాం., పట్టా తెప్పించి, అతనిచేత రెండు పరిశ్రమలు స్థాపింపచేయడం జరిగింది. ఆదాయపుపన్ను భారం తగ్గించడానికి, ఒక పెద్ద వ్యవసాయక్షేత్రం, కోళ్ళ పెంపక కేంద్రం, క్షీరోత్పాదన కేంద్రం ఇత్యాది కూడా మొదలుపెట్టారు. తన కొడుకు తనలాంటి ఒక అడ్వకేటు కాలేకపోయినందుకు తాండవకృష్ణకి కలిగిన నిస్పృహ, అనూరాధ లా కాలేజీలో చేరడంతో కొంచెం ఉపశమించింది.

పిల్లలిద్దరికి తండ్రి అంటే ప్రాణం, పరిధులు లేని అభిమానం కూడా. తాండవకృష్ణతన పిల్లలతో మిత్రభావంగా మెలిగేవాడు. సాయంత్రమయ్యేటపుడు, తండ్రీకొడుకులు నాలుగైదు పెగ్గులు తాగేవారు. ఆ సమయాలలో అనూరాధ వారికి కావలసిన తినుబండారాలు సమకూరుస్తూ అప్పుడప్పుడు వారి ఉల్లాస సంభాషణలలో పాల్గొనేది. కానీ, ఒక ఉత్తమ విద్యార్థిని కావడం చేత ఆమెకు అలాంటి అవకాశం అరుదుగా దక్కేది.

మురళీకృష్ణకి తండ్రిగారి గంభీర ఆకారం కానీ ఇతరులను ఆకట్టుకునే స్వభావం కానీ వారసత్వంగా లభించలేదు. మితిమీరిన ధనం, మరియు అతి వాత్సల్యం చేత చెడిపోయిన ఒక యువకుడు అతను. అన్ని దుర్గుణాలు ఎక్కువ లేకున్నా కనీసం కొద్ది మోతాదులోనైన అతనిలో ఉన్నాయి. మద్యపానం, ధూమపానంతోపాటు మత్తుమందు సేవించడమనే అలవాటు కూడా అతనికి ఏర్పడింది. అమ్మాయిలంటే అతనికి భలే పిచ్చి. అతను ఏ అమ్మాయినైనా ఆశించాడంటే, బలాత్కరించడానికి కూడా వెనుకాడేవాడు కాదు. కానీ నగరంలో ప్రముఖ క్రిమినల్ లాయరు, ఆస్తిపరుడు, గొప్ప పలుకుబడి ఉన్న తాండవకృష్ణుడి ప్రియపుత్రుడు కావడం వలన అతనికి విరుద్ధంగా ఫిర్యాదుచేసే ధైర్యం ఎవరికీ ఉండేది కాదు. గుర్రప్పందాలకు, పేకాటకు వెళ్ళే అలవాటు కూడా ఆ అబ్బాయికి ఉండేది. యువకుల మధ్యన జరిగే గలాటల్లోను, కొట్లాటల్లోను, పాల్గోవడం అతనికి సిగ్గుగా అనిపించేది కాదు. మొత్తంగా చెప్పాలంటే, మిత్రబృందాల

మధ్య అతను సాక్షాత్ ఒక రౌడీలా తయారయ్యాడు. లోకల్ పోలీసులు కూడా ఈ అబ్బాయి అంటే కొంచెం జడిసేవారు. తాండవకృష్ణకి కొడుకు దుర్గుణాలు కొద్దికొద్దిగా అర్థమైనా, "పాపం! తల్లి లేని సంతానం, చిలిపిపనులు ఈ వయసులో కాకపోతే మరెప్పుడు చేస్తాడు?" అని తనని తానే సమాధాన పరచుకునేవాడు, తప్ప తన కొడుకుకి మంచిగుణాలను నేర్పించే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు. ఉత్తమగుణాలని పేర్కొబడ్డ మంచి అలవాట్ల పట్ల అతనికి ఎప్పుడూ ఒక తృణీకార భావం ఉండేది. అలాంటి మంచి అలవాట్లు బీదవాళ్ళకి గానీ, మధ్యతరగతి వాళ్ళకి గానీ ఉండాల్సినవి. తన కొడుకు ఒక పురుషోత్తముడిలాగా దౌర్భాగ్యపు బతుకు బతకకుండా, సాక్షాత్ శ్రీకృష్ణుడిలాగా, సకల భోగైశ్వర్యాలను అనుభవిస్తూ..... జీవితమంతా ఒక పండుగగా గడపాలని అతని ఆకాంక్ష.

మురళీకృష్ణ, అతని చెల్లెలు అనూరాధ ఉత్తర దక్షిణధ్రువాల మాదిరి ఉండేవారు. ఆమె సకల సద్గుణాల రాశి. తన తండ్రికి ఎన్నో దుష్ప్రవణతలు ఉన్నాయని కలలో కూడా అనుకునేది కాదు. తన పుట్టుకతో కన్నుమూసిన తల్లి స్థానంలో మరో అందమైన జీవిత భాగస్వామిని ప్రతిష్ఠించకుండా కేవలం పిల్లల కొరకు జీవిస్తున్న ఆ తండ్రి పట్ల ఆమెకు మిక్కుటమైన అభిమానం..... ఆరాధాన ఉండేవి. ఎన్నో ఏళ్ళుగా విధురత్వం అనుభవిస్తున్న తన తండ్రి రాత్రి వేళల్లో మద్యపానం చేయడం ఆమెకు అంత తప్పనిపించలేదు. తన అన్నగారి ప్రవర్తన గూర్చి కొద్ది కొద్దిగా తెలుసుకున్న ఆ అమ్మాయి ఎప్పుడైనా దానిని గురించి మాట్లాడటం జరిగితే అది పెద్ద గొడవకి దారి తీసేది, దాని ప్రతిఫలంగా ఆమె చెవులు మెలిపడేవి. అన్నయ్యను మంచి దారిలోకి మళ్ళించమని ఆమె రోజూ దేవుడిని ప్రార్థించేది. అతను ఇలాగే ముందుకు సాగితే ఆ వచ్చే వదినకు ఎంత వ్యథ కలుగుతుందో అని ఆమె ఆలోచించి భయపడేది. పెండ్లి తర్వాత అతని స్వభావం మారవచ్చునేమో! వదిన తన ప్రేమ అనే కొలిమిలో అన్నయ్య స్వభావాన్ని కరిగించి నవీన రూపంలో తీర్చిదిద్దేటందుకు ప్రయత్నిస్తుందేమో అని ఆమె ఆశగా తనకు తాను సమాధానపడేది.